17

# అహం

హరీష్ బుర్ర గిర్రుమంది స్పీడు నందుకున్న సైకిల్‌చక్రంలా. ఒళ్ళే కాదు కళ్ళు చెమర్చుకుపోతున్నాయి. అమృతభాండంలో అణుమాత్రం విషం కలిసినట్టు అహ్లాదకరమైన వాతావరణం కాస్తా విషాదమయమైంది.

అతనికీమధ్యే పెళ్ళయింది. ఎంచక్కా భార్యతో సినిమా కెల్దామని తయారౌతుంటే పిడుగులా వచ్చిపడింది టెలిగ్రాం- నాన్నగారు పోయారని.

వెంటనే బయల్దేరాడు ఊరికి. ఊరు కొన్నివందల కి మీ.ల ధూరముంది కాబట్టి నాల్గు గంటలు పట్టింది ప్రయాణకాలం. ఉసూరుమంటూ ఇంటికెళ్ళేసరికి నాన్నగారి అంత్యక్రియలు నిన్ననే జరిగాయని తెలియగానే పిచ్చెక్కినంతపనైంది.

జన్మనిచ్చిన తండ్రి కడసారి చూపులకు నోచుకోకున్నా పార్థివశరీరాన్ని గూడా దర్శించుకోలేక పోయినందుకు గుండెలు పగిలేలా ఏడ్చాడు. శోకమూర్తి - అమ్మపాదాల మీదపడి అల్లాడిపోయాడు.

"నాన్న చనిపోగానే టెలిగ్రామిస్తే ఇప్పుడా రావడం?" అసహ్యంతో నిలదీసాడన్నయ్య.

"ఉద్యోగముంది.... పెళ్లాముంది-మిగతా వాళ్ళేలాపోతే వాడికేం?" చెల్లి మాటలు గుండుసూదుల్లా గుచ్చుకున్నాయి.

నలుగురు నాలుగురకాలుగా ఆడిపోసుకున్నారు. వదిన

మాతులు తిప్పింది. ఏతావాతా తేలిందేమిటంటే-టెలిగ్రామిచ్చిన మూడురోజులకు తనకందింది నత్త నడకనడిచి.

సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసులో పంజేసే హరీష్‌కు తన డిపార్టుమెంటును నమిలి మింగేద్దామన్నంత కోపమొచ్చింది. అసహనం ఆకాశాన్నంటింది.

సాయంత్రం వాళ్ళూర్లోని టెలిగ్రాఫ్ ఆఫీసువైపు లాక్కెళ్లాయి కాళ్ళు-తన టెలిగ్రామే ఎందుకంత ఆలస్యంగా ప్రయాణించిందో కనుక్కుందామనుకున్నాడు.

పోస్టాఫీసు టెలిగ్రాఫాఫీసు కలిసేవున్నాయి. సిగ్నలర్ రామనాథం తన మిత్రుడే...సాదరంగా ఆహ్వానించి కూచోబెట్టాడు.

తనకందిన టెలిగ్రాము కాపీని చూపించి ఏమిటీ అన్యాయమని వాపోయాడు.

"మీది సెంట్రల్ టెలిగ్రాఫ్ ఆఫీసు. ఇరవై నాల్గుగంటలు పంజేస్తుంది. మా ఆఫీసు కేవలం ఉదయం తొమ్మిది నుండి సాయంత్రం ఐదువరకే పంజేస్తుంది. ఆతర్వాత లేట్ ఫీజు (అదనపు చార్జీ) చెల్లించిఇచ్చే టెలిగ్రాములకోసమే పంజేస్తుంది.....

రామనాథం చెబుతూంటే మధ్యలోనే ఆపేసి.

"ఈ విషయాలన్నీ నాకు తెలుసు. కాని టెలిగ్రాము నెందుకంత ఆలస్యంగా పంపావు?" చిరుకోపం ధ్వనించింది హరీష్ మాటల్లో.

రామనాథంకు జాలేసింది.

"మీరు షిఫ్టుడ్యూటీల్లో పంజేస్తూ మీ ఆఫీసును 24గంటలు

నడిపిస్తారు. అంటే.... మేము లేట్ ఫీజుతో పంజేసే సమయంగూడా మీకు సాధారణమైన డ్యూటీతైమే " సృష్టికరించబోతుంటే

"అబ్బా! అదంతా నాకు తెలీదా? నీసుత్తి వినిపిస్తావేతప్ప అసలు సంగతి చెప్ప వేమిటో....?" చిన్నగా పటపటలాడుతున్నాయి పళ్లు.

"ఆదేవిషయం చెబుతున్నా ? మా లేట్ ఫీజు సమయంలో మీరు మీదగ్గరున్న మామూలు టెలిగ్రాంలు తీసుకోమని మా ప్రాణాలు తోడేస్తారు. మీ ఆఫీసుతో మేము ఎప్పుడూ పంజెయ్యాలి కాబట్టి మమ్మల్ని మీ బానిసలనుకుంటారు. మేమేమో ఉదయం తొమ్మిదికొచ్చి ఐదుగంటలదాకా మామూలు డ్యూటీచేసి ఐదుగంటలర్వాత గూడా లేట్ ఫీజు టెలిగ్రాంలకోసం డ్యూటీచేస్తాము. మీరేమో ఎనిమిదిగంటల డ్యూటీ పూర్తి చేసుకునిపోతారు. తర్వాత షిప్టులో వచ్చినవారు ఇవన్నీ మర్చిపోయి పోస్టల్ సిగ్నలర్సను చిత్రవధచేస్తారు...." రామనాథంకుగూడా కోపమొచ్చింది చిన్నగా.

"ఔను! సాయంత్రం డ్యూటీ వచ్చినప్పుడు నేను గూడా అలాగే చేస్తుంటాను. మీరిచ్చేవి టెలిగ్రాములు కాని మేమిచ్చేవి మాత్రం కావా-లేట్ఫీజు వసూలుచేయనంత మాత్రాన?"

"కాని మాదగ్గరుండేవి అదనపు చార్జీలు చెల్లించబడ్డవి. మేముండేది వాటిని పంపించి అలాంటివాటిని రిసీవ్ చేసుకుందుకే అ సమయంలో...."

"అద్సరేగాని.... నా టెలిగ్రామెందు కాలస్యమైంది?"

కోపంతో లేవబోతున్న హరీష్‌ను తిరిగి కూర్చోబెట్టాడు రామనాథం.

"మీ నాన్నగారు సాయంత్రం ఐదు గంటలకు చనిపోయారు...."

"ఔనట...."

"మీ అన్నగారు రెండ్రూపాయల అదపు చార్జీచెల్లించి ఐదున్నరకు నీకు టెలిగ్రామిచ్చారు...."

"ఔనూ...."

"నేను వెంటనే ఆ టెలిగ్రాంను మీ సీ.టీ.వో.కు ఆఫర్ చేసాను. కాని అక్కడున్న టెలిగ్రాఫిస్టు మహానుభావుడెవరోకాని తన వద్దనున్న మామూలు టెలిగ్రాములు తీసుకుంటేనే ఆ టెలిగ్రాం తీసుకుంటానన్నాను. ఐనా సరేనని తీసుకుంటున్నాను - కాని మధ్యలోనే లైను చెడిపోయింది"

"ఫోన్‌లోగూడా ప్రయత్నించాను.... ఫోన్‌లో వచ్చిన టెలిగ్రాఫ్ మాస్టర్ మావద్ద స్టాఫ్‌లేరు.... రేపివ్వమని ఫోన్ పెట్టేశాడు" అని కాస్సేపాగి.

"మర్నాడుగూడా లైను రాలేదు. విధిలేక పోస్టులో పంపించాను. పర్యవసానమిది " అన్నాడు రామనాథం.

హరీష్ ఒళ్ళంతా చెమట పట్టేసింది. గుడ్డలు తడిచిపోతున్నాయి.

ఆరోజు రామనాథంతో లైనులో పంజేసింది తానేననీ తన టెలిగ్రాం ఆలస్యంగా అందడానికి కారణం తానేననీ గుర్తుకొచ్చేసరికి నోట్లోంచి మాట పెగల్లేదు. కళ్ళల్లో నీళ్ళూరాయి.